# రోహిణి




"రోహిణీ!" వినువయంగా పిలిచాడు ప్రజాపతి.

"ఎంత మూర్ఖుణ్ణి! ఇంతవరకు గుర్తించనే లేదు, నిన్ను! నా సర్వశక్తులూ ధారపోసి నిరుపమాన సౌందర్యవతిగా సృష్టించాను సుమా!" విధాత పలుకులలోని వైలక్షణ్యాన్ని గుర్తించనే లేదు, అమాయకురాలు రోహిణి.

"కృతజ్ఞురాలిని తండ్రీ!"

"సర్వలోకైక సుందరీ! నిన్ను సృష్టించిన తరుణంలో నా భావనా విహంగం విహరించిన రీతి నే నిప్పుడు వివరించలేను. దివ్యమైన ప్రేయసీ ప్రియుల మంజిష్ఠ రాగారుణాధరములు కలిసినప్పుడు జనించిన దివ్యహాసాలనో, కోటి కోటి విపంచికల మధుర, మంజుల నాదాల నాలకించిన రసపిపాసి హృదయావేగాన్నో, దివ్యాప్సరస మధురలాస్య మొనర్చు వేళ మంజీరములపై పడి ప్రతిబింబించిన ఆమె శరీరపు దివ్యకాంతులు ఆమె కడకంటి చూపులో కలిసి హృదయాన్ని దూసుకుపోయేవేళ ఎదురుగా ఉన్న ఆమె ప్రియుని మనస్సులోని ఆరాటాన్నో ... ఏమో? దేనిని భావించానో, ఎన్నింటిని సృష్టించానో, ఎన్నింటిని నాశనం చేశానో, ఎన్ని తపస్సులు చేశానో, కాని నిన్ను కన్నులార చూసిన ఈ క్షణంలోనే ఏదో వింతకాంతి నా కన్నులలో నిండిపోయింది! ఏదో విలక్షణానందోద్భూత భావనా తరంగముంచితో సాగరమై పోయింది నా మనస్సు! నన్నేం చేయమంటావు సుందరీ? నా కోర్కెలన్నీ కుప్పచేసి దానికి ప్రాణం పోసి ఉంటాను!"



Stockists: SURAJ Medical Hall, Narayanguda, HYDERABAD-29.

"బ్రహ్మకైన పుట్టు రిమ్మ తెగులు అన్నారు. అందమైన అబల కనిపిస్తే, ఆమె పరస్త్రీ అనే జ్ఞానం కోల్పోయి, మృగంవలె ప్రవర్తించడం ఆ వెనుక దాగిన రహస్యం ఏమిటి? దానికీ ఒక పౌరాణిక కథనం ఉన్నదే! అదే ఇది.

"విధాతా! నీ వంటున్నది?. . ."

"ఇంకా గ్రహించలేదా నా వెర్రిరోహిణి!" లేచి మెల్లగా ఆమెను సమీపించాడు విధాత! "అనన్య సామాన్యమైన నీ రూపసంపద బ్రహ్మ మనస్సునే దోచుకుంది సుమా! త్రిమూర్తులలో ఒకడైన బ్రహ్మ ఈ క్షణాన నీ దాసుడు! అమేయ శక్తిసంపన్నుడైన నలువ, తీయతీయని కోర్కెల వేడిచే తపింపబడుతూ, తనను కరుణించమని — నీ ముందు కేలుసాచి అర్థిస్తున్న బిచ్చగాడు!"


అతడంటున్నదేమిటో అర్థమవ్వ కానట్లయిన ఆరిక్కపాప క్షణకాలం అలాగే స్తంభించిపోయింది. మెల్లగా తేరుకొని కోలుపోతున్న జ్ఞానాన్ని కూడ గట్టుకుంది.

"పితామహా! నీ వంటున్నదేమిటి? నీ పుత్రికను రోహిణిని తండ్రీ, నేను. నీవు స్వయంగా కన్యాదానం చేయగా, దివ్యపురుషమానసోద్భవుడైన, చంద్రుని చేపట్టిన అతని ప్రియపత్నిని! నీవేదో మైమరుపులో ఉన్నావు. ఒక్క క్షణకాలం శాంతంగా ఆలోచించు తండ్రీ!"

"ఊహూ! ఇలాంటి సంబోధనలతో నన్ను మరిపించాలని చూడకు రోహిణీ! చిరకాలం కష్టపడి, ఎంతో తపస్సు చేసి, నిన్ను సృష్టించాను. ఇన్ని దినాలు వృధాగానే గడిచిపోయాయి! నేటికి కన్ను తెరిచాను. నా తపస్సు ఫలించిందనుకొన్నాను. నన్ను దూరం చేయకు, నా కోర్కె కాదనకు. నీకు కావలిసిన వరాలిస్తాను. సర్వ చరాచర సృష్టిచేత నీకు జోహారులు చేయిస్తాను. . . ఆ హీనుడు మూర్ఖుడు అయిన చంద్రుణ్ణి గూర్చి ఎందుకాలోచిస్తావు? అంత మంది మధ్య నిన్నేం సుఖపెట్టగలడు? అయినా నా శాపాగ్నిదగ్ధుడై, దినదినానికీ క్షీణించే క్షయరోగిని పట్టుకు ప్రాకులాడేటంతటి అజ్ఞానురాలవని ఎలా అనుకోను రోహిణీ!"

"తండ్రీ!" కోపంతో మధ్యలోనే అతని మాటలు తుంచివేసింది రోహిణి. "ఏమైంది ఈవాళ నీకు? ఏదైనా పిశాచం ఆవహించిందా? లేక నన్ను పరీక్షిస్తున్నావా? ఇదేమి పరీక్షావిధానమయ్యా? అయ్యో! నా స్వామి, నా ప్రాణపతి, నా హిమకరుడు, నా దేవదేవుడు నా చంద్రుడు, నేను సహించలేను! అబ్బా!. . . ఏమిటిది?. . ." తడబాటుతోను బాధతోనూ, భయంతోను కోల్పోబోతున్న స్పృహ నిల్పుకొన ప్రయత్నిస్తూ అతి కష్టంమీద ఆమె

మధురాపంతుల
సూర్యప్రకాశ్



పలుకుతున్న పలుకులు, వాంఛానలదగ్ధుడై హితాహిత జ్ఞానశూన్యుడై సమీపిస్తూన్న విధాత వికటహాసాన్ని చూసి ఆగిపోయాయి.

కామము, అజ్ఞానాంధకారము కప్పిన పొరలలో నుండి, ఆ కోపం ప్రణయకోపం లాగు, ఆమె దుఃఖభరితమైన రోదనం ప్రణయోద్విగ్నకామినీ కంఠనిర్గత మధుర స్వరంలాగు వినిపిస్తూంది తమ్మిచూలికి.

"మూతి బిగించుకొన్న నీ ముద్దుమోము వింతసోయగాన్ని విరియజల్లుతూంది రోహిణీ!"

"ఆగు భ్రష్టుడా! నీ బ్రహ్మత్వాన్ని కోల్పోతున్నావు! నీచమైన, అధమమైన కామానికి లోబడి పవిత్రమైన ఉన్నతమైన స్థానంనుండి చ్యుతుడవౌతున్నావు!" పవిత్రమైన తండ్రీబిడ్డల బంధాన్నే మరిచిపోయావు! ఆ నాడు "సతీదేవిని, నా అక్కను అవమానించావు! అనుభవించావు. అప్పుడే మరిచిపోయావా! హీనుడా! అతిహీనమైన మృగరూపివైన నీవు నా స్వామిని పరిహసించడమా? అనన్య సామాన్య తేజోవిరాజమానుడు, సర్వప్రపంచాన్ని ఆనందసాగర తరంగ డోలికలలో ఉయ్యాల లూచేవాడు నా స్వామి. నా ప్రియపతి చంద్రుడెక్కడ? నీ వెక్కడ? ఛీ! ఛీ!" పొర్లుకొని వచ్చిన దుఃఖాశ్రు ప్రవాహం కోపంతో అగ్నిగోళాల్లా ఎరుపెక్కిఉన్న ఆమె కళ్లల్లో నీటిని చల్లార్చింది. "అయ్యో! విధాతవు! విశ్వాన్ని సృష్టించినవాడవు! నియమాల నేర్పరిచినవాడవు! అందరికి ఆదర్శాన్ని చూపవలసినవాడవు. ఇదేమి అన్యాయము తండ్రీ." దుఃఖంతో రుద్ధమైన కంఠంతో రోదిస్తూ ఆమె కూలబడిపోయింది.

"ఆహా! నన్నే ధిక్కరిస్తావా! హీనురాలా! నన్నే పరిహసిస్తావుగా! నిన్ను మృగిగానే మార్చి చేజిక్కించుకొంటాను. ఏ హీనుడు నిన్ను రక్షించ సాహసిస్తాడో రమ్మను. . ." కోపంతో గర్జించాడతడు!

మరుక్షణంలోనే, అసమాన సౌందర్యరాశి రోహిణిని మృగిగామార్చివేశాడు. తాను సంపూర్ణ మృగమయ్యాడు.

అసహాయ అయిన రోహిణి, ఏమి చేయడానికీ తోచక "రక్షించు! స్వామి! చంద్రా! నా స్వామీ, నీ రోహిణిని రక్షించుకో స్వామీ!" అని ఆక్రోశిస్తూ వెర్రిగా పరిగెత్త సాగింది.

* *

నక్షత్రాలనుండి అగ్ని వర్షించసాగింది. భీకర బడబానల జ్వాలలు విశృంఖల విహారం చేయసాగాయి. గ్రహాలన్ని గతులు తప్పాయి. సర్వప్రపంచము హాహాకారాలతో నిండిపోయింది! మహాంధకారంలో మునిగి పోయింది!

"పాహి! పాహి! శంకరా! అభయంకరా! త్రిశూలపాణీ పినాకధారీ! రక్షించు తండ్రీ! రక్షించు! శరణు! శరణు!" అన్న ఆక్రందనలతో తపస్సమాధిగతుడై ఉన్న విటలాక్షుడు మెల్లగా కన్నులు తెరిచాడు.

ఎదురుగా దీనాతిదీనంగా విలపిస్తూ మూర్ఛనొంది ఉన్న మృగిని చేతులలో ఎత్తుకొనిఉన్న మృగాంకుడు.

అతని వెనక ఇంద్రుడు, అష్టదిక్పాలకులు, ముక్కోటి దేవతలు, ఋషులు, మునులు. . .

అత్యంత భీభత్సమై, కల్లోలితమై పోయిన విశ్వం!

క్షణం కళ్ళు మూసుకొన్నాడు రుద్రుడు. సకలమూ అవగతం చేసుకొన్నాడు.

"ఫాలాక్షా! మహేశ్వరా! ఉమాపతీ! రక్షించు తండ్రీ! నియమ విరుద్ధమైన, అత్యంత జుగుప్సాకరమైన కార్యాన్ని చేయసమకట్టిన ప్రజాపతితో 'ఇది అన్యాయం!' అన్నాము స్వామీ! అదే మా దోషం. ఈ సకల చరాచర జగత్తునే నాశనం చేస్తానని హుంకరించాడు స్రష్ట. మాకు నీవు వినా దిక్కులేదు ప్రభూ! ఈ అన్యాయాన్ని అరికట్టు. బ్రహ్మనియమాలు తప్పితే లోకం నిలుస్తుందా మహాదేవా? సకల జగత్తూ అంధకారమయమై పోయింది. ఈ భీభత్సాన్ని తిలకించు స్వామీ. లోకంలోని దుష్టశక్తులన్నీ విశృంఖల విహారం చేస్తున్నాయి. ధర్మసంస్థాపన చెయ్యి ప్రభూ! అనాథరక్షకా! దీనుల్ని మమ్ములను కాపాడు. ధర్మమూర్తీ! పిపీలికకైనా బ్రహ్మకైనా ధర్మన్యాయం ఒక్కటే అని నిరూపించు. ఫాలలోచనా! దేవదేవా! రుద్రా! రక్షించు ప్రభూ! రక్షించు!" అని దీనంగా ప్రార్థిస్తున్న దేవతలను, తన ప్రియురాలికి వచ్చిన ఆపదను తప్పించలేక అసహాయుడై, పరిదీనవదనుడై ఉన్న చంద్రుణ్ణి అభయహస్తంతో ఆదరించి సమాశ్వాసించాడు రుద్రుడు.

మూర్ఛతేరి భయంతో వణికిపోతున్న రోహిణికి ఆమె స్వస్వరూపాన్ని ప్రసాదించి నందీశ్వరుని కంటి గుడ్డలో దాచివేశాడు. యథాప్రకారంగా చంద్రుణ్ణి తన సిగపూవుగా ముడుచుకొన్నాడు.

"ఎక్కడ? నా రోహిణి ఎక్కడ?" అంటూ సుడిగాలిలా వచ్చి పడ్డాడు మృగరూపియైన ప్రజాపతి.

"ఎక్కడుంది నా రోహిణి?" హుంకరించాడు బ్రహ్మ.

ప్రశాంతంగా నిలుచున్న స్థాణువుని చూసి మండిపోయాడు.

"ఓహో! బూది పూసుకుని శ్మశానాలలో పిశాచాలతో కలిసి గంతులు వెయ్యక నీ కెందుకయ్యా మా ప్రసక్తి? ఓహో! నువ్వేనా ఈ హీనుల్నందరినీ రక్షించేవాడివి? నిన్ను సృష్టించి నువ్వు కోరినట్లుగా తన మూడవ కన్ను నీ కిచ్చి శక్తి బూదిచేసి ఆ బూదితోనే భార్యను సృష్టించుకొన్నావని నీవు నాకు నీతులు బోధించ సాహసించావని పాపం వీళ్ళు గ్రహించలేరు! ఈశ్వరా! ఎందుకాలస్యం? నా రోహిణిని నాకు తిరిగి అప్పగించు." ఆ బూదితోనే ఆ శివుడే తననూ సృష్టించాడన్న విషయాన్ని విస్మరించాడు. కోరికల జ్వాలలో తన జ్ఞానాన్నంతటిని దగ్ధంచేసుకొన్న విధాత.

సిగలో ఉన్న చంద్రుని మనోజ్ఞ సుషమను మరపించే మధుర దరహాసాన్ని చిందుతూన్న శశిరేఖరుణ్ణి చూచి తోకతొక్కిన త్రాచే అయ్యాడు ప్రజాపతి.

"నా రోహిణిని నాకు మర్యాదగా అప్పగిస్తే నీ అకార్యాలని, అజ్ఞానాన్ని మన్నించాలనుకొన్నాను. మూర్ఖుడా! అనుభవించు ముందు నిన్ను మట్టుపెట్టి నిన్ను శరణు జొచ్చిన ఈ హీనులకి బుద్ధి చెబుతాను!"


హుంకరిస్తూ వాడికొమ్ములతో శివునిపైకి లంఘించాడు మాయామృగరూపుడు.

మరుక్షణంలోనే ఆకర్ణాంతజ్యాముక్తధనుష్టంకార నాదం సర్వ జగత్తులోను నిండిపోయింది. మృగవ్యాధరూపుడైన రుద్రుని హస్తగత పినాకోన్ముక్త భీకరబాణాహతికెరయై హా! అంటూ నేలకూలాడు, మాయామృగరూపధారి, ప్రజాపతి. ఆ మహోగ్ర భీకరనాదానికి భీతిల్లి ప్రళయ భయంకరుడైన రుద్రుని ముందు సర్వశక్తులూ తలలు వంచాయి.

తిరిగి ధర్మం స్థాపించబడింది హితాహితాలనూ పత్నిభావనలోని పవిత్రతనూ, విస్మరించిన విధాత తగిన శిక్ష పొందాడు. వేనోళ్ల కొనియాడి దేవత లిచ్చిన సార్థకమైన పశుపతిత్వాన్ని వరముగా పొంది "పశుపతి" అయ్యాడు మహేశ్వరుడు.

రుద్రజటాజూటస్థుడైన సోమునికి అతి సమీపంలో ఎల్లకాలం ఉండేవరాన్ని పొందింది మహాసాధ్వి, చంద్రుని ప్రియాతిప్రియపత్ని రోహిణి.

ఈ చిత్రనాటకం మనం ఇప్పటికీ ఆకాశంలో నక్షత్రాల ద్వారా ప్రతి రాత్రి ప్రదర్శింపబడటం చూడవచ్చు. ★

ఇంకా పొడుగు ఎదగండి

నూతన శాస్త్రపద్ధతులతో, వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి, ఆరోగ్యవంతులవండి. స్త్రీ పురుషులకు ఎలరకు అనువైనవి దీనివంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి ఎంతమాత్రం లేదు. వివరములు ఇంగ్లీషులోగాని తెలుగులోగాని ఉచితం.
**TOTAL HEALTH,**
**283, Azad Market (AVP),**
**Delhi-6.**

6 నెలలవరకు ఉచిత బహుమతి

స్త్రీల సౌందర్యము కాశ్మీర్ ఆరు చీరెల. ఆకర్షణీయమైన సరికొత్త డిజైన్లు, రంగులలో సీజనుకు తాజాగావచ్చినవి. పెద్ద సైజు. మావద్దమాత్రమేఉన్నవి. వెల డీలక్స్ చీరె1రు. 11/—లు 2 చీరెలు రు. 20/— లు, 3 చీరెలు రు. 28/—లు, 4 చీరెలు రు. 36/—లు, రెండు లేక ఎక్కువచీరెలు ఆర్డరిచ్చిన వారికి ఒక బ్లౌజుముక్క ఉచితం. ఆర్డర్లు పోస్టుపార్సెలుద్వారా పంపబడును
**ARVIND AGENCIES (AP-22)**
**Post Box 1408. Delhi-6.**